# జింకపిల్ల

-- నాగుల రాధేశ్యాం

ఎత్తుగడ్డలతో, దుమ్ము, దూళినిండిన 'కాలరీ' రోడ్డుమీద దగ్‌దగ్ మంటూ చప్పుడు చేస్తుండగా నేషనల్ పర్మిట్ పచ్చరంగుగల లారీ టోల్ టాక్సు పోస్టు దగ్గరికి వచ్చి అగి మొస తీసుకున్నది. గోదావరి మీద కొత్తగా నిర్మించిన బ్రిడ్జి వెడల్పు - నునుపు చూసి ట్రక్కుకు ప్రాణం వచ్చింది. తన అలసటను దట్టమైన పొగ రూపంలో వదిలి కొత్త ఉత్సాహంతో కొత్త బ్రిడ్జి ఛాతీమీద ట్రక్కు పరుగెత్త సాగింది. వర్షాకాలంలో ఓరుసు కుంటూ ఒత్తుకుంటూ పారిన నది. అత్యాచారం జరిగి చిక్కి పోయిన యువతి లాగా ఇవ్వాడు ఎండిపోయి ఉన్నది. అయువతి తెల్లబడిన వెంట్రుకల లాగా నదిలో తెల్లగా ఇసుక కన్పిస్తోంది.

ట్రక్కు క్యాబిన్‌లో మొత్తం ముగ్గురు ఉన్నారు. ఒకరు 'అతను' రెండవవాడు డ్రైవరు - ఇంకొకరు లారీ బంపరులాగా గూని గల బక్క పలుచటి క్లీనర్

వేడితో చిత్తుబొత్తు చేసే ఎండ. వేడిగాలి నుండి రక్షించుకోవడం కోసం డ్రైవర్ తలకు తెల్లని గుడ్డకట్టుకున్నాడు. రోడ్డుమీది గతుకుల్లాగా అతని ముఖం మీద ఎన్నో ముడుతలు.

"కొంచెం తలుపుమూయరాదు - వడగాలి కొడుతున్నది" అతను తెల్లటి ఖర్చీప్ కుడి చెవి దగ్గర పెట్టుకొని.

"బందు చేస్తే వేడికి మనం బాయిలర్ చికెన్ తీర్గ ఉడికిపోతం"

"నిజమే. ఇంజన్ మీది కవరు నుండే పొగలు లేస్తున్నవిది." కాళ్లదగ్గర వేడినిబట్టి అంచనా వేస్తూ అతను.

చదునైన రోడ్డు దాటి మళ్లీ ట్రక్కు గతుకుల రోడ్డుమీదికొచ్చింది.

మళ్లీ అదే కాలరీ. రోజు వందల కొలది వాహనాలను తనఛాతీ మీద మోసే సింగిల్‌రోడ్డు అక్కడక్కడ చెదిరిపోయి ఉన్నది. వర్షాకాలంలో పక్కలకు మట్టి కోసుకపోవడం వలన 'గాడాలు' ఏర్పడ్డాయి. రోడ్డు వెడల్పు చేయడానికి అక్కడక్కడ పోసియున్న కంకర కుప్పలు.

"నీయమ్మ - తాపతాపకు ఈ రోడ్డుమీద గేర్లుమార్చి మార్చి యాష్టస్తది. కొంచెం మరిసుంటే మనం లారీ కుప్పే." గొనుగుతూ డ్రైవరు ముందుమండి వచ్చే జీబునుండి తప్పించుకోవడానికి కట్ కొట్టాడు.

"చూపిండ్లా సార్! ఎంత పెద్ద అక్సిడెంటు తప్పించుకుష్నం. నీతల్లి బిక్షమెత్తుక బతుకు కాని డ్రైవరై మాత్రం బతుకొద్దు. బాయిల (గని) మీపని మంచిపని. కిరికిరి లేనిపని." డ్రైవరు.

"ఔను అలుకటి పనే - దూరపు కొండలు నీలంగానే కన్పిస్తాయి. " అతని గొంతులో బరువుకు ఈ మాట బయటికి రాలేదు. లోపలే ఉండిపోయింది.

"లైను మీదికెక్కిన మంటే ఇంటికి చేరుకునే దాక నమ్మకంలేదు. రోడ్లమీద అక్సి డెంట్లు చూసి లోపల వనుకు బుడుతది. " డ్రైవర్ నిట్టూరుస్తూ.

"గనిలో దిగి బయటకు వచ్చేదాకా మాకుమాత్రం గ్యారంటీ ఉన్నదా? "ఎప్పుడు చెరచెర పై కప్పు మీద కూలి దానికింద అణగిపోతామో?" అతను మనసులో.

ముందు రెండు బొగ్గుటిప్పర్లు - బహుశా వెనుక కూడా ఉండొచ్చు. వెనుక నుండి హారన్ అదే పనిగా మోగుతోంది. లారీ వాటిమధ్య కిడ్నాపు చేసినట్టుగా ఉన్నది. రైల్వేట్రాకుమీద ఓవరు బ్రిడ్జికోసం జరుగుతున్న పనివలన ప్రక్కనుండి వేసిన కచ్చా రోడ్డుమీద లారీ నడుస్తోంది.

"మీదేమున్నదిసార్ ఎనిమిది గంటలు డ్యూటీ చేసి - ఇంటికాడ పడుతరు. మరివేంవెు వదిహేను రోజులదాకా ఇంటిముఖం చూసెరుగం - ఎక్కువ మాట్లాడుతే నెలదాక - ఈ క్యాబినేమాయిల్లు పెళ్లామైతది."

"అట్లాగే అన్పిస్తుంది. బొగ్గుబాయి వనంటే నీకేమెరుక. మీరు కనీనం బయటిగాలిలో తిరుగుతరు. రోజు కొత్త కొత్త జాగాలల్లోకి తిరుగుతరు. కాని మేము? బొగ్గు గనిలోకి దిగినామంటే - ఎనిమిదిగంటలు కిటికీలు, దరువాజులులేని అంధకారపు గదిలో బంధించినట్లు - శ్వాస తీసుకోవడం కష్టం - పైగా భరించరాని వేడి - ఒక్కొక్కక్షణం ఒక్కొక్క యుగంలాగా'' అతను అంతరంగంలో.

డ్రైవరు లారీని పెట్రోలు బంకువద్ద అపి "పదండిసార్ కొంచెం నాస్తా చేద్దాం. మళ్లా అన్నందొరికేనరికి ఏ ఒంటిగంట దాటిపోతదో?"

"మీరు చెయ్యండి నేను వచ్చేటప్పుడే తినొచ్చిన"

"పోనియ్యండి చాయన్న తాగండి."

అతనుకూడా క్యాబిన్‌లో నుండి కిందికి దిగాడు.

బల్లచెక్కలు అడ్డదిడ్డంగా కొట్టిన కర్ర బెంచీల మీద కూర్చుండి డ్రైవరు, క్లీనర్ నూనెతో సగం కాల్చిన రొట్టెతో పాటు అమ్లేటు కడుపులోకి తోస్తున్నారు.

చాయ్ తాగుతూ అతను గడియారం వంక చూసుకున్నాడు.

పదకొండు. చంద్రాపూర్ చేరుకునేసరికి ఎలాగైనా నాలుగవుతుంది. సమయానికి ఈ లారీ దొరకకపోతే? రామగుండం రైలుకోసం పోతే - పైనరాఘవాపురం స్టేషన్లో గూడ్సురైలు డిరేలు మెంటగుటవలన అన్ని రైల్లు అలస్యంగా నడున్తున్నట్లుగా తెల్పింది. జీటిఎక్సుప్రెసు ఎప్పుడొస్తుందో? అసలు వస్తుందో రాదో అన్నారు స్టేషన్లో - సీదా బస్సుకూడా లేదు. అదృష్టంకొద్ది ట్రాన్సుపోర్టు రాధేలాల్ కలిసి - తమదే లారీ నాగపూర్ పోతుందని - అందులో ఎక్కించడం మంచిదైంది... ఈలారీ దొరకకుంటే రాత్రి వెళ్లి లాయరు ఇల్లు ఎక్కడని వెతికేది. తనకు వరిచయమున్న ఊరు కూడా కాదు. రేపటిదాకా అగేందుకు వీలులేదు. రేపే కోర్టులోపేసి అతని అలోచనలు అతనివి.

"నడవండిసార్ పోదాం" డ్రైవరు అనడంతో అతని అలోచనలు తెగిపోయాయి.

అతను లారీ ఎక్కి కూర్చున్నాడు. డ్రైవరు కూడా ఎక్కికూర్చున్నాడు.

ఖాళీ కడుపులో కాసంత పడేసరికి ట్రక్కు నెమ్మదిగా స్టార్టయ్యింది.

క్లీనర్ కింది ఉండిపోయి - లారీ వడునత్తుండగా కోతిలాగా ఎగిరి ఎక్కికూర్చున్నాడు దర్వాజాలో ఒక కాలు బయటకు మరొకకాలు లోపలపెట్టి.

"మీకు హోటల్లో తినడం యిష్టం లేనట్లున్నది." డ్రైవర్.

"అలాంటిదేమిలేదు."

"నిజమే. ఇంటి తిండి ప్రాప్తం ఉంటే హోటల్ కూడేం ఖర్మ. మాకిది అలవాటైపోయింది. " రెండు మోచేతులతో స్టీరింగును కంట్రోలు చేస్తూ సిగరెట్టు ముట్టించి దమ్ము కొడుతూ.

"ఇంటితిండా?" అతని మనుసులో మళ్లీ అంటుకున్నది.

"తనకు ఇల్లుందా? భార్య ఉంది,

ల్లలున్నారు - ఫ్రిజు, టీవి అన్నీ ఉన్నాయి. యినా ఇల్లెక్కడున్నది? అదెప్పుడో ·లిపోయింది."

దుమ్ము, ఎండుటాకులను తనతోపాటే ప్పుకొంటూ సుడిగాలి లారీముందునుండి పోయింది. లారీ నెమ్మదిగా పోతోంది



రోడ్డుకిరు పక్కలా కనుచూపు మేర వడగాలిలో మెరుస్తున్న - మండుతున్న మైదానాలు - కళ్లు చిరుతలు కమ్ముతున్నాయి. రోడ్డు పక్క ప్రభుత్వం నాటిన చెట్లెప్పుడో ఎండి పోయాయి. ఆకుల్లేని మోడువారిన ఒకటి అరా చెట్లు అక్కడక్కడ కన్పిస్తున్నాయి.

ఎడారి ప్రాంతంలోని మనుషుల్లా - చిక్కిశల్యమైన మానవ అస్థిపంజరాల్లాగా ఆ చెట్లు నిలుచున్నాయి.

"చూడర - వెనుక టైరు గడచిడున్నట్టున్నది." డ్రైవర్.

"చూస్తఉస్తాద్." కోతిలాగా నడుస్తున్న లారీ మీదనే బాడిలోకి ఎక్కాడు క్లీనర్.

"సార్ ఇంటినుండి బయలుదేరి పదిహేను రోజులయ్యింది. మొగని జాడ పెండ్లానికి, పెండ్లాంజాడ మొగనికి తెలువకుంట నెలల తరబడి తిరుగుడే ఉంటది."


"ఇక్కడ ఒకేకప్పుకింది - కలిసి ఉండి కూడ ఎవరి గురించి ఎవరు ఆలోచిస్తారు? ఒకే ఇంటిలో, ఒకే గదిలో ఉంటూ కూడా ఇద్దరివి వేరు వేరు ప్రపంచాలు. ఒకరిది ఉత్తర ధృవమైతే మరొకరిది దక్షిణ ధృవం. ఇద్దరి ప్రపంచాలు ఎక్కడవేరయ్యాయి? ఎప్పుడు వేరయ్యాయి." అతని ఆలోచనలు లారీ ఎంత వేగంగా నడుస్తున్నదో అంతేవేగంగా సాగుతున్నాయి......కాని అతని ప్రశ్నలకు అతనికి ఎన్నడు జవాబు దొరుకలేదు.

అతను విస్తుపోతాడు. ఈరోజు మొదటిసారిగా తనగురించి, తన గతించిన జీవితం గురించి తవ్విపోసుకుంటున్నాడు. అంతా కలగాపులగం. కొసామొదలు దొరకడం లేదు. అతనికి ఏదీ గుర్తుకు రావడంలేదు....ఇందాకా ఓవరు బ్రిడ్జి దగ్గరి కచ్చారోడ్డులాగా. తన బండి ప్రధాన మార్గం వదిలి ఎప్పుడో కచ్చారోడ్డు మీద కొచ్చేసి నడుస్తోంది? లేదా ఏదైనా ఎడారిలో కూరుకపోయిందా? నాలుగుదిక్కులా చెలరేగే ఇసుకే ఇసుక.

అతను కొంచెం వెనక్కిజరిగి కూర్చున్నాడు. ఇప్పుడతని దృష్టి పక్క అద్దంమీద పడింది. ఆ అద్దంలో ఏదో చిత్రం రూపుకడుతోంది. అది భ్రమే అయినా స్పష్టంగా కన్పిస్తోంది. అద్దంలో అతను చెమ్మాసుతో బొగ్గుఎత్తి తట్టనింపుతున్నాడు. నిలువెల్లా చెమటలు కారుతున్నాయి. చీకటి బొగ్గు గుయ్యారంలో - బొగ్గుకుప్పల మధ్య వెన్నెల తునకలాగా ఆమె ముఖం.......తనవేడి ఉచ్ఛ్వాసనిశ్వాసల్లో ఆమె వేడినిట్టూర్పులు కలిసిపోయాయి.

అతని అలసట ఎక్కడ ఎగిరిపోయిందో.. .....తను డ్యూటీ నుండి వస్తున్నాడు ఆమె ఎదురు చూస్తూ వాకిట్లో నిలుచున్నది అద్దంలో కన్పిస్తోంది........ బొగ్గు పొయ్యిమీద తయారుగా ఉన్న వేడినీళ్లు - స్నానం చేసిన తరువాత తువ్వాళ్లతో నిలుచున్న ఆమె.....

ఈ జీవన క్రమమంతా ఎప్పుడు తెగిపోయింది?




లారీ హారన్‌తో అతని ఆలోచనల ప్రవాహం ఆగిపోయింది.

అతనిచూపులు అద్దంమీద ఇంకా నిలిచి ఉన్నాయి.

అద్దంలో - రోడ్డు, రాళ్లు, చెట్లు అన్నీ వలయాలువలయాలుగా తిరుగుతూ వెనుకబడి పోతున్నాయి.

ముందు ఎత్తుగడ్డ వచ్చింది. లారీథర్డ్ గేరులోకి మారింది.

ఇద్దరి ఊపిరులు వేరు వేరు కావడం ఎప్పుడు ప్రారంభమయ్యింది? అతను తెగిపోయిన ఆలోచనలను మళ్లీ అతుక్కుంటూ.....

"ఉస్తాద్ వెనుకపయ్య పంక్చరైనట్లున్నది!' ' లారీ బాడీలోనుండే క్లీనర్ అరిచాడు.

'ఈమన వనైపోయింది. ఎండకాల మచ్చిందంటే ఇదేకిరికిరి." లారీని నెమ్మదిగా ఒక చింతచెట్టు నీడకు తెచ్చి ఆపుతూ గొణిగాడు.

అతను చేసేదేమీలేక లారీదిగి చింతచెట్టునీడలో ఉబ్బుకొచ్చిన చింతవేరు మీద గొంతుక కూర్చున్నాడు.

క్లీనర్ జాక్ బిగించిలారీని ఎట్లా పైకెత్తుతున్నాడో అట్లాగే తన జీవితం కూడా బరువుగానే అయినా పైకి లేచింది.

కోల్ ఫిల్లర్ నుండి కోల్‌కట్టరు - తర్వాత సర్దారు - సర్దారు నుండి ఇప్పుడు జర్మన్ దగ్గర - కాని కాని అప్పుడు గనిలో చాలా సమయం గడిపేవాడు. ఇప్పుడు కూడా అంతే. అప్పుడు తను పైకి రావడానికి గనిలో తన రక్తం చెమట కలెగల్పాడు. ఇప్పుడు ఇంటినుండి దూరం పారిపోవడానికి గనిలో గడుపుతున్నాడు.

అతనట్లా గతం వర్తమానం కలెగాపులగం అయిన స్థితిలో ఉండగానే క్లీనర్ టైరు మార్చాడు. అందరు ఎక్కి ఎప్పటిలాగే ఎవరి సీట్లలో వాళ్లు కూర్చున్నారు. క్లీనర్ మాత్రం ఇప్పుడే నీళ్లల్లోనుండి లేచి వచ్చినట్టుగా ఒళ్లంతా చెమట కారుతుండగా - అయినా పనిచేసిన తృప్తితో వెలిగిపోయే ముఖంతో కూర్చున్నాడు.

ఉత్తపున్యానికే డ్రైవర్‌కు కూడా చెమట కారుతోంది. రోడ్డుమీద ఎండకు మెత్తబడిన డాంబర్‌లాగా అతని ముఖంలో చెమట.

లారీ నడుస్తున్నాకొద్ది అందరు కొంత గాలి పీల్చుకున్నారు. కొంచెం రిలాక్సయ్యారు. లారీ కిరకిరలాడుతూ తనసహజ శబ్దాలతో నడుస్తోంది.

దానిలో - అక్కడక్కడ రోడ్డు పక్క నిలబడిన ప్రయాణీకులు ఆపడానికి చెయ్యి చూపుతున్నారు. కాని డ్రైవర్ ఎవరికోసం కూడా లారీ ఆపకుండా తోలుతున్నాడు.

" ఈ రూట్లో చాలాసేపటి నుండి బస్సురానట్టున్నది." డ్రైవర్.

ఒక ముసలివాడు హఠాత్తుగా తెగించిన వానిలాగా రోడ్డు మధ్యలో నిలబడి లారీని ఆపాడు రోడ్డుపక్క ఆకులు జొడించిన టేకుచెట్టు కింద చిన్న పంచీపట్టుకొని ఒక యువతి నిలబడి ఉన్నది.

"ముసలిముండాకొడుకు చూడు ఎట్లా భయంభీతి లేకుండా రోడ్డుమీదికి వచ్చి ఆపుతండు. కొద్దిగా బ్రేక్ పనిచేయ్యకపోతేనో?' ' చిరచిరలాడుతూ డ్రైవర్.

"ఉస్తాద్ ముసలోనెంట పిల్లున్నది. తీసుకో - మస్తుటైంపాసైతది." క్లీనర్ వెకవెకలాడుతూ.

"ఈగాడ్డికొడుక్కు ఎప్పుడు అదే ధ్యాస.' ' అనుకుంటూనే డ్రైవర్ లారీని ఆపాడు.

అతను లారీ దగ్గరికి వచ్చిన ఆ యువతిని చూసి విస్తుపోయాడు.

"అరె! ఈ అమ్మాయి ఇంతెండలో - ఈ అడవిలో ఎందుకున్నది?"

అతను ఆశ్చర్యంతోనూ, దిగ్భ్రమలో ఉండగానే -

ముసలివాడి చెయ్యి అందిపుచ్చుకొని క్లీనర్ ముసలివాన్ని లారీలోకి లాక్కున్నాడు.

ఆతరువాత ఆ అమ్మాయి ఎవరి సహాయం అక్కరలేకుండానే సంచితో సహా చెంగున ఎగిరి అతను నమ్మలేనంత వేగంగా క్యాబిన్‌లోకి గెంతి కూర్చున్నది.

అతను మరింత గందరగోళపడి - ఎప్పుడో అడుగున పడిన జ్ఞాపకాలు కెలికికెలికి ఆమె పేరు - ఆమెకు సంబంధించిన సమస్త విషయాలు గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు." ఔను గంగ - గంగేకదూ!'

' గంగ తనను గుర్తుపట్టి - ఔను గుర్తుపట్టి తనను తనలాగే ఆశ్చర్యపడి తనను ఏవేవో అడుగుతుందనుకున్నాడు. గంగ అదేమి పట్టించుకోకుండా - అపరిచితురాలిలాగా కూర్చున్నది.

తనను గుర్తుపట్టలేదా? తను పెద్దగా మారలేదే? చిత్రంగా ఉందే ఎట్లా సాధ్యం? పోనీ - తనే -

'గంగా?" అతను.

ఆమె "నాపేరు గంగకాదు లక్ష్మి" ఏమాత్రం తొట్రుపాటులేని కంఠంతో అనేసి "అబ్బ ఏమెండ? ఏమెండ?" అనుకుంటూ చీరకొంగుతో ముఖం తుడుచుకున్నది.

క్యాబిన్‌లో నిశబ్దం .... లారీ స్పీడందుకున్నది చెట్లు గుట్టబోర్లు వెనక్కి పోతుండగా లారీ పరుగెత్తుతోంది.

ఆ యువతి రావడంతో క్యాబిన్‌లో ఒక కొత్త చిత్రమైన వాతావరణం నెలకొన్నది. డ్రైవర్ తనసీట్లో సర్దుకుని కూర్చున్నాడు.....

అతను నమ్మలేకపోతున్నాడు. తనకేమైంది? తనజ్ఞాపకాలవి తప్పా? లేదా తనకు తెలియని విషయాలు పరివర్తనలు జరిగిపోతున్నాయా? గమనించినట్టు కాకుండానే అతను గంగను పరిశీలనగా చూశాడు గోచీపోసి కట్టిన చీర - మెడలో నల్లపూసలు - చూస్తే పెళ్లైన స్త్రీలాగే కన్పిస్తోంది... చదువుకొని - పల్లెటూరి స్త్రీలాగా కన్పిస్తోంది. మనుషులను బోలిన మనుషులుంటారా?

"నువ్వు మల్లమ్మ కూతురువికాదా?" అతను ఉండబట్టలేక.

ఒకసారి అమాకయమైన చూపు చూసి పొరపాటునడుతున్నారేమొ? మల్లమ్మెవలు. మా అమ్మపేరు గౌరమ్మ" అన్నది. దానిమీద అంత శ్రద్ధలేనట్టు అతని చేతిలోని పత్రిక తీసుకొని పేజీలు తిప్పసాగింది.

సందేహం లేదు. గంగయే కాని ఎందుకనో తను అపరిచితురాలిగానే ఉండదలుచుకున్నది. పోనీయ్ తనకెందుకు? ఎందుకిట్లా మనుషులు ఒకరికొకరు అపరిచితులౌతున్నారు?

"నీకు సదువత్తదా?" క్లీనర్ బోలెడంత ఆశ్చర్యపడుతూ.

"అదేందది - బియ్యేపాసైన" గంగ కిలకిలలాడుతూ.

డ్రైవర్, క్లీనర్ కూడబలుక్కున్నట్టుగా బిగ్గరగా నవ్వారు....

ఆమె కూడా తనకేది పట్టనట్టు నవ్వులో నవ్వు కలిపింది.

కొంచెం దూరంలో కూర్చున్న ముసలతను గంగతండ్రి కాబోలు. మామగారైతే పల్లెటూరివాళ్లు ఎదురుగా కూర్చోరు. కూర్చున్నా ఇట్లా ప్రవర్తించరు.

అతను ఆముసలాయనతో మాటలు కలపాలనుకున్నాడు. కానిసాధ్యమయ్యేట్టులేదు. ఇంకా ఆమెతో ఏదన్నా మాట్లాడుదామనుకున్నాడు. కాని ఆమె అందుకు అవకాశం యిచ్చేట్టులేదు.

ఈ అమ్మాయికూడా జింకపిల్లకన్నా తక్కువేం కన్పించడం లేదు. కందిరీగనడుములాంటి సన్నని నడుము. నడకలో వేగము. మాటల్లో చంచలత్వము. ముఖంమీద తెలియని వింత వెలుగు.

ముందట టేకు కర్రలోడు లారీ - లారీ టాప్‌గేర్లో ఘర్షిల్లుతూ గుట్టబోరు ఎక్కుతోంది. దాని వెనకే అతను ఎక్కిన లారీ నడుస్తోంది. కోతిముఖపు క్లీనర్ తాపతాపకు తినేసేలాగున ఆ అమ్మాయిని చూడసాగాడు.


" పిల్లకావాలనే సందేహం లేదు అపరిచిత లాగా వ్యవహరిస్తోంది.

"బురీనజర్‌వాలే తేరాముహ్ కాలా (చెడుచూపు గలవాని ముఖం నల్లన)" ఆ అమ్మాయి కొంటెస్వరంతో బిగ్గరగా కర్రలారీ వెనక భాగంలో రాసి ఉన్నదాన్ని చదివింది.

దొంగకు తేలుకుట్టినట్టుగా క్లీనర్ ముఖం - ఆమె లారీకేసి చూసి నవ్వు నవ్వింది. గలగలనవ్వు, స్వచ్ఛమైన వింతస్వరం గలనవ్వు. నరాలు మొత్తం సల్లుబిగయ్యేలాంటి గమ్మత్తైన నవ్వు ఆ క్యాబిన్‌లో సుళ్లు తిరిగింది.

అతను ఆమె నవ్వినందుకు కాకుండా ఆమెకు చదువు అది కూడా హిందీ భాష చదవడం వచ్చినందుకు ఆశ్చర్యపోయాడు. తనకు తెలిసినంతవరకు ఆమెకు చదువుకోవడానికి అవకాశమే దొరకలేదు.

టేకు కర్రలోడుగల లారీని దాటవేసి తాము కూర్చున్న లారీ ముందు పరుగెత్తసాగింది.




అడవి ఆరంభమయ్యింది. కీకారణ్యము. ఎండాకాలం కావడంవలన చెట్లన్ని ఆకులు రాల్చిఉన్నాయి. రోడ్డు మలుపులో పెద్దబోర్డు - దానిమీద పరుగెత్తుతున్న జింకపిల్ల బొమ్మ "అభయారణ్యము - వన్యమృగ సందర్శనం చూసి ఆనందించండి.." అని ఆ పెద్ద బోర్డుమీద రాసిఉంది.

కొండల లోయల్లో ఎల్లుగడి పర్వట్టున్నది. రాలిన ఆకులు - ఎండిన కర్రలు అక్కడంతా పెట్రోలు చల్లినట్లుగా చిటపట శబ్దాలు చేస్తూ మండుతున్నాయి. కొండ శిఖరందాకా దట్టమైన పొగలు లేస్తున్నాయి.

కొంతమంది ఆదివాసి మనుషులు అంత ఎండలో కూడ కాళ్లకు చెప్పులు లేకుండా

కావళ్లు మోసుకుంటూ అడవిలో వాళ్ల గూడాలకేసి పరుగెత్తుతున్నారు.

అడవి ఇంకా అఖరుకాకముందే ఆమెలారీ ఆపమని చెప్పింది.

"ఊరైతే ఇంకా చాలా దూరముంది?' ' డ్రైవర్.

"ఇక్కడేదిగాలి" ఆమె.

డ్రైవర్ అర్థంకాని ముఖంపెట్టి లారీని ఆపాడు. అయిదురూపాయలనోటు తీసి క్లీనర్ చేతిలో పెట్టింది. క్లీనర్ నోరు తెరిచాడు.

క్యాబిన్‌లో వాళ్లంతా ఆశ్చర్యంలో ఉండగానే జింకపిల్లలాగే కిందికి దునికింది.

క్లీనర్ సంచి ఆమెకు అందించాడు.

ముసలాయన లారీ దిగనందుకు క్లీనర్ ఆశ్చర్యపడుతూ -

"నువ్వు దిగవా తాత" అన్నాడు.

"లే - నేను ముంగట దిగుత" తాత

"అయితే ఆ పిల్ల నీతో రాలేదా?"

"లే - తాత.

డ్రైవర్ న్యూట్రల్‌నుండి గేర్ మార్చి ఎక్సిలేటర్ తొక్కాడు. లారీ ముందుకు కదిలింది.

'ఇక్కడ చుట్టుపక్కల ఊరేదిలేదే - బండ్లబాట మాత్రమే కన్పిస్తోంది. పిల్ల చూస్తే గిరిజనుల పిల్ల తీర్గలేదు. మరి ఇక్కడెందుకు దిగినట్టో?" డ్రైవర్ నెత్తిగోక్కుంటూ గొనిగాడు.

"నాకుమాత్రం తెలిసి చచ్చిందా? ఏది తెల్పిందని" అతను మనసులో అనుకున్నాడు.

"సంచి మాత్రం బాగా బరువున్నది ఉస్తాద్". క్లీనర్ అని -

"సంచిలో బట్టలు గిట్టలుంటే అంత ఏఖుముండది ఉస్తాద్" మళ్లీ తనే .....


అపిల్ల అక్కడి వాళ్లందరికి ఒక్క చిక్కుముడిలాగే తోచింది. స్తబ్దంగా ఉండే క్యాబిన్‌లో సంచలనం రేపిపోయింది. ఆ నలుగురు ఎవరి సంస్కారాన్ని బట్టివాళ్లు ఆ పిల్ల గురించి ఊహించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు.

లారీ అడవి దాటింది ... ఒక చిన్న ఊరు దగ్గర ముసలతను కూడా దిగిపోయాడు. క్యాబిన్‌లో ఎప్పటిలాగే ఆ ముగ్గురే మిగిలిపోయారు.

ఉండబట్టలేక "సాలా ఈ ఆదిలాబాదు జిల్లా డేంజరస్ - ఏది అర్థం కాదు" అన్నాడు క్లీనర్ ఉండబట్టలేక.

"నువ్వు నోరుమూసుకోరా! ఎవల పనులాల్లయి." డ్రైవర్.

లారీ ఆ చిన్న ఊరును దాటి కొంచెం దూరం పరుగెత్తి రోడ్డు పక్కనగల పిక్కులోల్ల దాబా హోటల్ (గుడిసె హోటల్) ముందు అవురావురు మంటూ ఆగింది... కొంచెం దూరంలో ఆంధ్రప్రదేశ్‌కు మహారాష్ట్రకు మధ్య సరిహద్దు మీద చెక్‌పోస్టు దగ్గర నాలుగైదు లారీలు ఆగి ఉన్నాయి.



క్లీనర్, డ్రైవర్ కాళ్లు చేతులు కడుక్కొని ఎదురెదురు మంచాలల్లో కూర్చున్నారు. వాళ్లిద్దరి మధ్య చెక్కబెంచీ - వాళ్లపక్కనే గల మరొక చెక్క బెంచీ మీద అతను కూలబడ్డాడు.

"మీకు నడుస్తదా సార్!" డ్రైవర్ గ్లాసులో పోసుకుంటూ అడిగాడు.

"లేదు - లేదు. మీరు కానియ్యండి". అతను.

"మాకు ఇది అలవాటయ్యింది. సార్. బండిలో పెట్రోలు పొయ్యకుంటే నడువది - అది హాప్ క్వార్టర్" డ్రైవర్.

అతను దానిదేముందిలే అన్నట్టు నవ్వాడు. అతని కోసం అన్నం, ఆలుగడ్డ కూర, పప్పు వచ్చింది.

డ్రైవర్ తందూరి రోటీ, చికెన్ కోసం ఆర్డరిచ్చాడు.

అదొచ్చేసరికి ఆలస్యమయ్యేటట్లున్నది.. ఆ పక్క మంచాలల్లో కూడా ఎదురు చూస్తున్నారు.

అతను అన్నం తినేసి చేతులు కడుక్కున్నాడు.

"సార్! మీరు అగో ఆ వేపచెట్టు కింది మంచాల్లో కాసేపు నడుం వాల్చండి. మేం తినంగనే బయలుదేరుదాం". డ్రైవర్.

పొయ్యి మీద కోడిగుడ్ల వేపుడు వాసన జమాంచి కొడుతోంది.

అతను ఆ పక్కనేగల వేపచెట్టు కింద మంచం మీద కూర్చున్నాడు. బాగా అలిసిపోయినా కూడా పడుకోవడానికి మనస్కరించలేదు. వెన్నుదాపు కోవడానికి మంచం మీద ఒరిగాడు. అతని పక్క మంచంలో ఒక పక్క లారీ డ్రైవర్ పడుకొని సైలెన్సర్ లేని బండిలాగా గురక పెడుతున్నాడు.

గడియారం చూసుకున్నాడు. మధ్యాహ్నం రెండయ్యింది.

చంద్రపూర్ ఎక్కువలో ఎక్కువ ఇంకా రెండు గంటల ప్రయాణం. నాలుగున్నర లేదా అయిదు గంటల వరకు ఎట్టి పరిస్థితిలోను చేరుకోగలడు. ఆటో పట్టుకుంటే సీదా లాయరు ఇంటికి నగినాబాగ్ చేరుకోవచ్చు. ఇల్లు దొరకబట్టడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. నగినాబాగ్‌యే కదా! అనుమానం వేసి జేబులో నుండి కాగితం తీసి "చంద్రకాంత్ గోఖ్లే, అడ్వకేట్, నియర్ సవారి బంగ్లా, నగినాబాగ్, చంద్రపూర్" చదువుకున్నాడు.

ఒకటి వెనుక మరొకటి కటకట శబ్దం చేస్తూ ఎడ్లబండ్లు రోడ్డుమీది నుండి పోతున్నాయి. బండ్లలో స్త్రీలు, పిల్లలు కూర్చుండి ఉన్నారు. ఇంత ఎండలో కూడా వాళ్లు ఎంతో ఉత్సాహంగా మాట్లాడుకుంటూ పోతున్నారు. ఒక బండిలో పెళ్లి బట్టలేసుకొని బాసింగాలు కట్టుకొని పెళ్లికొడుకు కూర్చుండి ఉన్నాడు.

అతనికి తన కూతురు పెళ్లి మనసులో మెదిలింది. ఎంత అట్టహాసంగా చేశాడు తన కూతురు పెళ్లి - బియ్యే చదివించిన దాన్ని - దేనికి లోటు రాకుండా పెంచిన - అల్లుడు కూడా ఇంజనీరు - అయినా ఏమయ్యింది? సంవత్సరమైంది ఇంటిమీదికొచ్చి - ఇప్పుడు అల్లుడు విడాకుల నోటీసు పంపించాడు.

అతనికి గంగ జ్ఞాపకం వచ్చింది. ఎంత హుషారైన పిల్ల. తన బిడ్డ బాయిలర్ కోడిపిల్ల మాదిరి. కూతురు వ్యక్తిత్వం అట్లా ఎట్ల తయారైనట్టు? ఆధారం లేకుండా బతకలేక పోతున్నది. చెప్పించిన చదువు - అమర్చిన వసతులు ఏవీ దాన్ని ఆదుకోలేకపోయాయి.

పెళ్ళికి ముందు దానికోసం ఎన్ని ఇబ్బందులు పడ్డారో? పెళ్లి తర్వాత దాని బతుకు అట్లాగే తన మీదే ఆధారపడిఉన్నది.

"సర్దార్‌జీ - ఏం చికెనయ్యా బిల్‌కుల్ నరమున్నది. మజారాలే" డ్రైవర్ గొంతు విన్పించింది. అటు చూస్తే మంచం మీద డ్రైవర్, క్లీనర్లిద్దరు తినడంలో తీనమైపోయారు.

గంగ ఇక్కడ - ఈ అడవిలో ఎట్లా తారసపడినట్టు? ఎక్కడి నుండి వస్తున్నట్టు? ఎటుపోతున్నట్టు - తన ముందు అట్లా ఎందుకు నటించినట్లు తన పేరు లక్ష్మి అని ఎందుకు చెప్పినట్లు - తల్లి పేరు తప్పే చెప్పింది. పెళ్లయ్యిందా? పైగా చదువెప్పుడు నేర్చుకున్నట్లు - అతనికి గంగకు సంబంధించిన ప్రశ్నలు అనేకం వచ్చాయి..

అడుగుదామంటే ఛాన్సే యివ్వ లేదు. గంగే కానియ్యి - కాకపోనియ్యి తనకెందుకు? గంగనే-

ఆకుల సందుల్లో నుండి సూర్యకిరణాలు తళతళలాడుతో కళ్లల్లో ప్రతిఫలిస్తున్నాయి. కొంచెం జరిగి పడుకున్నారు.

తనకు పరిచయం లేని నిశబ్దం. నిశబ్దంలో అప్పుడప్పుడు ఎప్పుడో మరిచిపోయిన చిత్రమైన మాటలు, శబ్దాలు.. ఇక్కడ రోడ్డు పక్క పడుకోవడం అతనికి చిత్రంగా అన్పించింది.

ఆరేడు సంవత్సరాల బక్కపలుచని అమ్మాయి. ఆమెచంకలో ఒకసంవత్సరపు పిలగాడు.. పిల్లవాన్ని కిందదించి ఆ అమ్మాయి ఆడిస్తున్నది. పిల్లవాడు తప్పటగులు వేస్తూ, నవ్వుతూ ఆ అమ్మాయి కేసివస్తున్నాడు.

"నిన్నెందుకు పెట్టుకున్నట్టు - పిలగాన్ని ఎత్తుకోవడానికా కిందదించడానికా?" లావటామె ఒకామెవచ్చి పిల్లనుకసురుకున్నది.

ఆ అమ్మాయి బెదిరిపోయి ఆ బొద్దు పిలగాన్ని చంకలో వేసుకున్నది.

అతని మెదట్లో హఠాత్తుగా దృశ్యం నిలిచిపోయి - మాడిపోయిన తందూరిరోటి వానసలాంటిదేదో ఫీలింగు చోటు చేసుకున్నది.

గంగ - అంటే రెండువేల రూపాయలకు తాకట్టుపడిన అమ్మాయి. ఆమెతల్లి తన బావగారి తమ్ముని ఇంట్లో పనిమనిషి. బావతమ్ముడు బాగా ఉన్నవాడు. ఉద్యోగరీత్యా జిల్లా కోర్టులో పేరుమోసిన లాయర్..... హఠాత్తుగా పనిమనిషి అయిన గంగతల్లి జబ్బుపడ్డది...ఆమె మందుల ఖర్చులు, హాస్పిటల్ ఖర్చులు రెండువేల బాకీ పడ్డది. ఆ బాకీ వంతుకు గంగ తాకట్టు పడిపోయింది. గంగకు జీతం లేదు. బాకీ పడ్డ డబ్బుకు పడ్డీలేదు.


అతనికి పొయ్యిమీద గోధుమరొట్టె కాలినట్టుగా ఉన్నది. ఇసుక లారీ ఒకటివచ్చి రోడ్డు పక్క ఆగింది. భయపడేమనిషి గుండె లాగా ఆ లారీ ఇంజన్ డగ్‌డగ్‌మని కొట్టుకుంటోంది.

అతనెప్పుడు బావగారింటికి పోయిన గంగ కన్పించేది. గంగ బావ తమ్ముని ఇంట్లో ఒక సభ్యురాలయ్యింది. గంగ ఎత్తుకునే పిల్లవానికి నాలుగైదు సంవత్సరాలొచ్చిన కూడా కాళ్లు పీలబడిపోయి నడువలేక పోయాడు. గంగనే ఆ పిల్లవాని చంకకర్ర - అతని కాళ్ళు గంగాయే. అన్ని పనులు ఆ పిల్లవానికి గంగ చేయవల్సిందే. ఆ కుంటి పిల్లవానికి తండ్రి తల్లీ, దాసి, అన్నీ గంగే అయ్యింది.

ఈ మధ్యలో తను అటుకేసిపోక చాలారోజులయ్యింది. పది నెలలక్రితం వెళితే అక్కడ గంగ కన్పించలేదు. మేడమెట్లు మీద బిందెతో నీళ్లు తెస్తూ గంగతల్లి కన్పించింది.

గంగ గురించి అడిగితే మాటమార్చింది. తను తన గొడవల్లో ఉండి అదేమి పట్టించుకోకుండా వచ్చేశాడు. మళ్లీ ఇప్పుడు అనుకోకుండా ఈ అడవిలోనే గంగను చూడడం. అదీ ఒకమెరుపు మెరిసి మాయమైనట్టు? తనకు జవాబులు దొరకని అనేక ప్రశ్నలురేపుతూ - అన్ని రకాలుగా తను చెదిరిపోయి ఉన్న ఈస్థితిలో గంగ తనకెందుకు కన్పించాలి? అదీ తనకు సవాలులా?

డగ్‌డగ్ మనే ఇసుకలారీ అలాగే డగ్‌డగ్ మనుకుంటూ వెళ్లిపోయింది.



అతను నడుంవాల్చిన మంచంమీదికి ఎండవచ్చేసింది. పొద్దుగ్గా గాలిపీల్చి - తన మనసులో చెలరేగే ప్రశ్నలను దూరంకొట్టడానికి లేచి దాబా హోటల్ వద్దకువెళ్లి అక్కడ జెగ్‌లో ఉన్న మంచినీళ్లను ఎత్తి గటగట తాగాడు.

అవరకే డ్రైవర్, క్లీనర్ భోజనం కానిచ్చి పోవడానికి సిద్ధమయ్యారు.

ఇంతలోనే వేగంగా ఒక జీబొచ్చి హోటల్‌ముందు ఆగింది. ఆజీబులో నుండి అయిదుగురు పోలీసులు కింద దునికారు. అక్కడ వాతావరణం మారిపోయింది. పోలీసులు అక్కడి లారీలను చుట్టుముట్టి క్యాబిన్లన్ని ఎక్కి సోదాచేశారు. వాళ్ల చేతుల్లో ఎక్కుపెట్టిన తుపాకులు చూసి అందరు మాటలాపి విస్తుపోయి వాళ్లనే చూస్తున్నారు......

హోటల్లోని డ్రైవర్లు, క్లీనర్లు ఎవరి లారీల దగ్గరికి వాళ్లు వచ్చి నిల్చున్నారు.

'అపోరెక్కడ?" ఒక పోలీసు తలపాగా చుట్టుకున్న ఒక సిక్కుడ్రైవరును జబర్దస్తీగా అడిగాడు.

"ఏపోరి సాబ్!" డ్రైవర్ తికమకపడుతూ.

"అదే - పచ్చచీరకట్టుకున్నది. చేతిలో సంచిఉన్నది. నీట్రక్కులో ఎక్కిందికదా?" పిస్టోలు పట్టుకున్న పోలీస్ ఇన్స్పెక్టర్.

"అటువంటిపిల్ల నా బండిలో ఎక్కలేదు సార్" సర్దార్జీ.

"అట్లనా? లోపటేసి బొక్కలిరిస్తే తెలుస్తది. వీన్ని జీబెక్కించండి" ఇన్స్పెక్టర్.

"వాహెగురువుకీ కసమ్ సాబ్! (దేవుని తోడు)" సర్దార్జీ భయపడుతూ.

అప్పటికే అన్ని లారీలతో పాటు వీళ్లలారీ క్యాబిన్‌లో కూడా వెతికి పోలీసులు కిందికి దిగారు.

అందరిని అడిగినట్లుగానే అతన్ని, లారీ డ్రైవర్‌ను, కోతిముఖపు క్లీనర్‌ను గుచ్చి గుచ్చి ప్రశ్నించారు. అందరిలాగే అలాంటి పిల్లను తాము లారీ ఎక్కించుకోలేదని డ్రైవర్ చెప్పాడు.

పోలీసులు జీబుదగ్గరికి వచ్చి నిల్చున్నారు.

"పోరి కన్నుమూసి తెరిచేంతలోపల మాయమయ్యింది"ఒక పోలీసు. ఎట్లావచ్చిన జీబు అట్లాగే వెళ్లిపోయింది.

"పదసార్ పోదాం" డ్రైవర్ పిలిచాడు.

అతను, క్లీనర్ క్యాబిన్‌లో ఎక్కికూర్చున్నారు.

"సాలా!పెద్దగండం గడిచింది" డ్రైవర్ గేర్‌మార్చి అక్సిలేటర్ తొక్కాడు.

నల్లని డాంబర్ రోడ్డు మీదలారీ దూసుకపోతోంది. ☆